క్లుప్తంగా

దుకాణాల వేలంపాట వాయిదా


వేలం నిర్వహిస్తున్న అధికారులు

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో నిర్మించిన దుకాణాల బహిరంగ వేలంపాట వాయిదా పడింది. బుధవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం సమావేశ మందిరంలో అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. ఇందులో భాగంగా క్రీడా ప్రాంగణంలో నిర్మించిన 22 దుకాణాలకు వేలం నిర్వహించగా... ఆశించిన స్థాయిలో స్పందన రాకపోవడంతో పాట వాయిదా వేసినట్లు అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహాల ప్రతిష్ఠ


కోదండ రామాలయం

డెంకాడ: మండలంలోని పినతాడివాడలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని గ్రామ పెద్దలు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ, వేద పండితులు పప్పు కిరణ్‌కుమార్, మాలా జగన్నాథరావు శర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రారంభోత్సవం, ప్రత్యేక పూజలు, యాగాలు జరుగుతాయన్నారు. 3వ తేదీ వరకు పూజలు జరుగుతాయని తెలిపారు.

నైతిక విలువలు పాటించాలి

- ఆధ్యాత్మికవేత్త అనంత్‌కుమార్


మాట్లాడుతున్న ఆధ్యాత్మికవేత్త అనంతకుమార్

పూసపాటిరేగ: విద్యార్థులు నైతిక విలువలు పాటించాలని ఆధ్యాత్మికవేత్త పోతినిండి అనంత్‌కుమార్ సూచించారు. మండలంలోని గోవిందపురంలో పోతినిండి కనకదుర్గమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థులకు జ్ఞానవికాస వేసవి తరగతులు ప్రారంభించారు. విద్యార్థులకు భోజన, వసతి సౌకర్యం కల్పించారు. విద్యార్థులకు వేదాలు, రామాయణ, మహాభారతంపై అవగాహన తరగతులు ప్రారంభించారు. ప్రతి విద్యార్థీ పాఠ్యాంశాలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అమ్మ పరివార్ సభ్యులు విక్రం వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


బుచ్చన్నకోనేరులో ఆలయ నిర్మాణానికి విరాళమందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధి

విజయనగరం: నగరంలోని కనకల శ్రీనివాసరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. శ్రీనివాసరావు వర్ధంతి సందర్భంగా ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కనకల రఘు నేతృత్వంలో పూల్‌బాగ్ ప్రేమసమాజంలోని వృద్ధులకు పండ్లు, రొట్టెలు, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం బుచ్చన్నకోనేరులో ఆలయ నిర్మాణానికి రూ.10వేల మొత్తాన్ని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కనకల రఘు మాట్లాడుతూ, తమ సోదరుడు శ్రీనివాసరావు జ్ఞాపకార్థం 18 సంవత్సరాలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పుష్పకుమార్‌రెడ్డి, కొండలరావు, రాజు, తాలాడ గిరి, మద్దిల సతీష్ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ చారిత్రాత్మకం


లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ

భోగాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్ర మం దేశంలోనే చారిత్రాత్మకమని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తెలిపారు. వైఎస్సార్ జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీలో భాగంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాయలంలో లింగావలస గ్రామానికి 17 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భోగాపురం మండలంలో 2,184 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్ల పట్టాలను పంపిణీ చేసిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, సుందర హరీష్, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ మొదటికొచ్చిన సమస్య

- మొయిద జంక్షన్‌లో రోడ్డుపైకి మురుగునీరు


మొయిద జంక్షన్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి మొయిద జంక్షన్‌లో మురుగునీటి సమస్య మళ్లీ మొదటికొచ్చింది. మురుగునీటి కాలువలో అడ్డంకులు ఏర్పడడంతో ఎగువ నుంచి ప్రవహించే మురుగునీరు వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారిపైకి చేరుతోంది. దీంతో వాహనదారులు, స్థానిక వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో మురుగునీటి కాలువలను ఆక్రమించుకుని, పలువురు వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. కాలువలపైనే శ్లాబులు, పలకలు ఏర్పాటు చేశారు. దీంతో సుమారు ఏడాది కిందట కూడా ఇక్కడ మురుగునీరు రోడ్డుపైకి ప్రవహించింది. పరిస్థితిని చక్కదిద్దడానికి నగర పంచాయతీ అధికారులకు 15 రోజుల సమయం పట్టింది. ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడం, కాలువలను ఆక్రమించుకున్న దుకాణదారులు సహకరించకపోవడంతో అప్పట్లో చాలా ఇబ్బంది పడాల్సివచ్చింది. బుధవారం కూడా అలాంటి పరిస్థితే తలెత్తింది. కాలువల్లో పూడికలు పేరుకుపోవడంతో మురుగునీరు రోడ్డు మీదుగా ప్రవహిస్తోంది. కమిషనర్ బాలాజీ ప్రసాద్ పరిస్థితిని పరిశీలించి, వెంటనే కాలువల్లో పూడికలు తొలగించి, పరిస్థితిని చక్కదిద్దాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావును ఆదేశించారు. కాలువలను ఆక్రమించుకున్న దుకాణదారులు తమకు సహకరించాలని కోరారు. కాలువలపై నిర్మించిన శ్లాబులు, పలకలను స్వచ్ఛందంగా తొలగించాలని సూచించారు.

విజయనగరంలో 'శర్వాణి' స్వీట్స్


శర్వాణి అవుట్‌లెట్‌ను ప్రారంభిస్తున్న సీవీ రాజు

విజయనగరం: సంప్రదాయ పిండివంటలు, స్వీట్లను అందించే శర్వాణి స్వీట్స్ విజయనగరంలో అడుగుపెట్టింది. ఔటర్ రింగ్‌రోడ్డులోని సన్ స్కూల్ సమీపంలో ప్రత్యేక హంగులతో ఏర్పాటు చేసిన అవుట్‌లెట్‌ను సీవీ రాజు బుధవారం ప్రారంభించారు. అత్యంత నాణ్యతతో స్వచ్ఛమైన మిఠాయి అందించే శర్వాణీ విజయనగరం వినియోగదారులకు చేరువవ్వాలని ఆయన ఆకాంక్షించారు. తమ తొలి అవుట్‌లెట్‌ను 1993లో సీతమ్మధారలో ప్రారంభించామని, ఇప్పటివరకు విశాఖపట్నంలో 11 అవుట్‌లెట్లు ఏర్పాటు చేసినట్లు సర్వాణి స్వీట్స్ డైరెక్టర్ ఎస్ఎస్ఆర్ ప్రభాకర్ వర్మ తెలిపారు.

ఒకటో తేదీనే పింఛన్ ఇస్తున్న ఏకైక సీఎం జగన్

లక్కవరపుకోట: భారతదేశంలో ఒకటో తేదీనే ఇంటి వద్దకు పింఛన్ డబ్బులు పంపిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వీరభద్రపేట గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని అక్కడికక్కడే పరిష్కరించే ప్రయత్నం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామని, త్వరలోనే గ్రామంలోని ప్రతీ ఇంటికీ పూర్తిస్థాయిలో తాగునీరు అందిస్తామన్నారు.

రైతన్నకు అండగా డీసీఎంఎస్ సేవలు

- డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ భావన


వరి విత్తనాలు విక్రయిస్తున్న చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన

విజయనగరం ఫోర్ట్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయాల మేరకు రైతన్నకు డీసీఎంఎస్ ఎప్పుడూ అండగా ఉంటుందని.. ఇందులో భాగంగానే ఖరీఫ్ సీజన్‌కు ముందు నుంచే వరి విత్తనాలు అందిస్తున్నామని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన అన్నారు. బుధవారం స్థానిక డీసీఎంఎస్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న విత్తనాల విక్రయ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతుల ప్రయోజనం కోసం మార్కెట్ కంటే తక్కువ ధరకు నాణ్యమైన ఎంటీయూ 1121, సోనామసూరి, సాంబమసూరి, ఫౌండేషన్ వరి విత్తనాలతో పాటు పయోనీర్ మొక్కజొన్న విత్తనాలను విక్రయిస్తున్నట్లు చెప్పారు. గత సంవత్సరం విత్తనాలను వాడిన రైతులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు చెప్పారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు ప్రతి బ్యాగ్ నుంచి 100 విత్తనాలు వేరు చేసి మొలకశాతం పరీక్షించాలన్నారు. 70 శాతం మొలక శాతం రాకపోతే బ్యాగ్ సీల్ చింపకుండా తిరిగి ఇచ్చేయాలని సూచించారు. ఆ తర్వాత లేపాక్షి నోట్ పుస్తకాల విక్రయాలను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్, లగుడు శివాజీ, డీసీఎంఎస్ డైరెక్టర్ ఎస్.సన్యాసినాయుడు, లచ్చిరెడ్డి కృష్ణ, బిజినెస్ మేనేజర్ సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు టెక్కలిలో గడప గడపకు..

నెల్లిమర్ల రూరల్: టెక్కలి పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గిరిబాల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమానికి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు హాజరవుతారని పేర్కొన్నారు.

సచివాలయాలు.. గ్రామస్వరాజ్యానికి నాంది

- ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు


సవరవిల్లిలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

భోగాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి జాతిపిత బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి నాంది పలికారని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని సవరవిల్లి పంచాయతీలో రూ.40 లక్షల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.17.50 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం.. చేపలకంచేరు పంచాయతీలో రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయం.. ముక్కాం పంచాయతీలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం.. ముంజేరు పంచాయతీలో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రంతో పాటు మండల కేంద్రం భోగాపురంలో రూ.5 లక్షల ఎంపీపీ నిధులతో నిర్మించిన బస్ షెల్టర్‌ను ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డితో కలిసి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు అందజేసేందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చారని గుర్తు చేశారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు సీఎం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. నాడు - నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నారని.. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా వసతులు కల్పించారని చెప్పారు. ఆరోగ్యశ్రీ పరిధిని పెంచి పేదలకు ఉచిత వైద్య సేవలు అందజేస్తున్నారన్నారు. రైతులకు పెట్టుబడి సాయంతో పాటు విత్తనాలు, ఎరువులు అందజేస్తూ జగనన్న అండగా నిలుస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో దాదాపు 98.5 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందని, రానున్న ఎన్నికల్లో మరోసారి జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ దంతులూరి రావాబాబు, పడాల భానుప్రకాష్, హౌసింగ్, మత్స్యశాఖ డైరెక్టర్లు ఉప్పాడ శివారెడ్డి, ఎం.నరసింహులు, బైరెడ్డి ఎర్రప్పలనారాయణ, ప్రభాకరరెడ్డి, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, కొమ్మూరు సుభోషణరావు, పట్న తాతయ్యలు, పోతిరెండి గోపిరావు, కర్రోతు శ్రీనివాసరావు, సర్పంచ్‌లు ఉప్పాడ విజయభాస్కరరెడ్డి, అరజర్ల నరసింగరావు, వాసుపల్లి ఎర్రయ్యమ్మ, పూడిక నూకరాజు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


బాధితుడి భార్యకు చెక్ అందజేస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎంపీపీ అనూషారెడ్డి

భోగాపురం: ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్‌ను ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు బాధితుడి భార్యకి అందజేశారు. మండలంలోని దల్లిపేట గ్రామానికి చెందిన కిలుము తోటయ్యరెడ్డి కొన్ని నెలలు కిందట విద్యుత్ ప్రమాదానికి గురై చేతులు కోల్పోయాడు. దీంతో భార్య, ఇద్దరు పిల్లలతో జీవనం సాగించలేక ఇబ్బంది పడుతున్నాడు. ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వారు స్పందించి మండలంలో నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయ శంకుస్థాపన కార్యక్రమానికి ఇటీవల విచ్చేసిన సీఎం జగన్ మోహన్‌రెడ్డికి జరిగిన విషయాన్ని తెలియజేశారు. ముఖ్యమంత్రి తక్షణమే స్పందిస్తూ సీఎం సహాయ నిధి నుంచి రూ..3.80 లక్షలు మంజూరు చేశారు. సంబంధిత చెక్‌ను ఎంపీ, ఎమ్మెల్యే బాధితుడి భార్య శివమ్మకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి, సర్పంచ్ ఉప్పాడ విజయభాస్కరరెడ్డి, దల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీకే విక్రయించాలి

డెంకాడ: ప్రభుత్వం నిర్దేశించిన ధరకే విత్తనాలు అమ్మాలని విజిలెన్స్, వ్యవసాయాధికారులు విత్తన, ఎరువుల దుకాణాల యజమానులను ఆదేశించారు. శ్రీకాకుళం విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బి.సింహాచలం, హెచ్‌సీ కె.అప్పన్న, ఏవో పి.నిర్మల, తదితరులు డెంకాడలోని సాయికృష్ణ, గంగమాంబ ఎరువులు, విత్తనాల దుకాణాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాకు, రికార్డులు పరిశీలించారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు.

ఎరువుల షాపుల్లో తనిఖీలు

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాల షాపులుపై విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. రైతుమిత్ర ఎంటర్‌ప్రైజెస్, వెంకటసాయి గణేష్ ట్రేడర్స్‌లో తనిఖీలు చేపట్టి రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని సూచించారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బి.సింహాచలం, ఏఓ కె. నీలమ, తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు

- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు జయచంద్రనాయుడు


డీఎంహెచ్‌ఓ రమణకుమారి దంపతులను సన్మానిస్తున్న ఐఎంఏ ప్రతినిధులు, డీఎంహెచ్‌ఓ కార్యాలయం సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపు తీసుకువస్తాయని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.జయచంద్రనాయుడు అన్నారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయలో బుధవారం ఉద్యోగ విరమణ చేసిన డీఎంహెచ్‌ఓ ఎస్‌వీ రమణకుమారి దంపతులను కార్యాలయం సిబ్బంది, ఐఎంఏ ప్రతినిధులు, పీహెచ్‌సీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జయచంద్రనాయుడు మాట్లాడుతూ, రమణకుమారి చిత్తశుద్ధి, అంకితభావంతో పనిచేశారన్నారు. కోవిడ్ మహమ్మారి కట్టడికి తీవ్రంగా కృషి చేశారని తెలిపారు. కిందిస్థాయి సిబ్బందితో స్నేహపూర్వకంగా మెలిగేవారని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఉప్పు అప్పలరాజు, ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి, డాక్టర్ మోహనరావు, ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ మహేంద్రగిరి, డాక్టర్ మధుకర్, నాగేశ్వరావు, సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో 'జగనన్నకు చెబుదాం'


రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ బాలాజీ ప్రసాద్

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని అన్ని వార్డు సచివాలయాల్లోనూ ప్రతిరోజూ విధిగా జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించాలని కమిషనర్ పి.బాలాజీప్రసాద్ కార్యదర్శులను ఆదేశించారు. పట్టణ పరిధిలోని జరజాపుపేట-2 సచివాలయాన్ని బుధవారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. గ్రీవెన్స్‌సెల్‌కు ఎన్ని ఫిర్యాదులు, వినతులు వచ్చినదీ కార్యదర్శులను ఆరా తీశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్‌సెల్ నిర్వహించాలని ఆదేశించారు. సచివాలయం స్థాయిలో పరిష్కరించలేని వినతులను తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యదర్శులంతా సమయపాలన పాటిస్తూ, నిత్యం పట్టణవాసులకు అందుబాటులో ఉండాలని సూచించారు.

చిత్తశుద్ధితో పనిచేయాలి

డెంకాడ: ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంలో వలంటీర్లు చేస్తున్న కృషిని గుర్తిస్తూ సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులతో సత్కరిస్తున్నట్లు ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అన్నారు. ఇకపై కూడా వలంటీర్లు మరింత చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. మండలంలోని డెంకాడ గ్రామ సచివాలయం వద్ద డెంకాడ, సింగవరం, నాతవలస గ్రామాలకు చెందిన వలంటీర్లను సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, డెంకాడ పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, సర్పంచ్ పతివాడ గౌరి, వైఎస్సార్‌సీపీ నాయకులు పిట్టా అప్పారావు, బి.రమణ, అధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.


ఆక్రమణలను ఉపేక్షించం


కాలువలపై ఆక్రమణలను పరిశీలిస్తున్న కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు

విజయనగరం: నగరంలో ప్రధాన కాలువలపై ఆక్రమణలకు పాల్పడితే ఉపేక్షించమని కార్పొరేషన్ కమిషనర్ శ్రీరాములనాయుడు హెచ్చరించారు. నగరంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో రైల్వే ఇనిస్టిట్యూట్ పక్కన కాలువపై ఏర్పాటు చేసిన దుకాణాలను బుధవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలోని కాలువలను ఆక్రమించి దుకాణాలు గాని, ఇతర వ్యాపారాలు గాని సాగించినట్లయితే ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో టీపీఎస్ పద్మ, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్ పదవికి రేవతీదేవి రాజీనామా

- వ్యక్తిగత కారణాలతో స్వచ్ఛందంగా తప్పకున్న ఇసరపు
- నూతన డిప్యూటీ మేయర్-1 ఎన్నికకు మార్గదర్శకాలు జారీ
- వచ్చే నెల 4న నోటిఫికేషన్... 8న ఎన్నిక


ఇసరపు రేవతీదేవి

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్-1గా బాధ్యతలు నిర్వహించిన ఇసరపు రేవతీదేవి ఆ పదవి నుంచి తప్పుకున్నారు. నగరంలోని 13వ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న రేవతీదేవి స్వచ్ఛందంగా తన పదవికి రాజీనామా చేస్తూ ఏప్రిల్ మూడో వారంలో లేఖ సమర్పించగా... ఇటీవల నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి రాజీనామా లేఖను ఆమోదించారు. విజయనగరం కార్పొరేషన్ హోదా దక్కించుకున్న తర్వాత మొదటిసారిగా జరిగిన ఎన్నికల్లో డిప్యూటీ మేయర్-1గా 1వ డివిజన్ నుంచి ఎన్నికైన కార్పొరేటర్ ముచ్చు నాగలక్ష్మిని ఎన్నుకున్నారు. అయితే ఆమె కరోనాతో మృతి చెందడంతో అనూహ్యంగా ఆ పదవి రేవతీదేవికి లభించింది. 2021 ఆగస్టు 4వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆమె పదవీ బాధ్యతలు చేపట్టారు. వ్యక్తిగత కారణాలతో స్వచ్ఛందంగా ఆమె బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు సమాచారం.

వచ్చే నెల 4న నోటిఫికేషన్ ..

విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్-1 పదవికి ఇసరపు రేవతీదేవి రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. రేవతీదేవి రాజీనామా విషయాన్ని ఎన్నికల కమిషన్‌కు తెలియజేయడంతో నూతన అభ్యర్థిని ఎన్నుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నీలం సాహ్ని విజయనగరం జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు బుధవారం వెల్లడించారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలతో జూన్ 4వ తేదీన ఎన్నిక నోటిఫికేషన్ విడుదల చేయనట్లు చెప్పారు. జూన్ 8వ తేదీ ఉదయం 11 గంటలకు కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో డిప్యూటీ మేయర్ - 1 ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఒకే పాలకవర్గం హయాంలో మూడోసారి డిప్యూటీ మేయర్ -1 పదవికి ఎన్నికలు జరగడం విశేషాన్ని సంతరించుకుంది.

ఎవరికి దక్కేనో...?

డిప్యూటీ మేయర్-1 పదవి ఎవరిని వరించబోతుందన్న చర్చ ప్రారంభమైంది. ఇంతకుముందు డిప్యూటీ మేయర్‌గా పనిచేసిన ముచ్చు నాగలక్ష్మి మృతి చెందడంతో ఆమె స్థానంలో ఒకటో డివిజన్ నుంచి గెలిచిన ఆమె కుమార్తె ముచ్చు లయ, ఏడో డివిజన్ కార్పొరేటర్ పొంతపల్లి మాలతి పేర్లు వినిపిస్తున్నాయి. మాలతి మున్సిపల్ మాజీ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణపై పోటీ చేసి గెలుపొందింది. ప్రస్తుతం వీరిద్దరి పేర్లు వినిపిస్తున్నాయి. మరి ఆ పదవి ఎవరిని వరించనుందో తెలుసుకోవడానికి ఎన్నిక వరకు ఆగాల్సిందే..